10 YEAR ANNIVERSARY 2014 - 2024
# పెన్ పవర్
తెలంగాణ రౌండప్
ఆదివారం 1 డిసెంబర్ 2024 పేజీలు 8




# గిగ్ కార్మికులు..!
# సమకాలీన ప్రపంచంలో వారి ప్రాధాన్యత..!

## సామాజిక వేత్త మధుబాబు చికిలే డిజిటల్ వేదిక కార్మికులపై విశ్లేషణ..

- గ్లోబలైజేషన్, సాంకేతికత అభివృద్ధి, డిజిటల్ ఎకానమీతో ఉపాధి ప్రపంచంలో పెను మార్పులు..
- మానవ అవసరార్థం ఏర్పడిన నూతన రంగం "గిగ్ ఉపాధి"పుట్టుక అవసరాలే ఆవిష్కరణలకు మూలం
- అసలు గిగ్ ఎకానమీ అంటే ఏమిటి..? గిగ్ కార్మికుల విభజన..! వారి ప్రాధాన్యత..!
- కాంట్రాక్ట్ ఆధారిత ఉపాధి విధానం..! గిగ్ కార్మిక వ్యవస్థ సాంప్రదాయ ఉద్యోగానికి భిన్నమైనది..!
- ప్రస్తుతం గిగ్ కార్మికుల పరిస్థితి..! వారికున్న సవాళ్లు, అవకాశాలు ఏమిటి..?

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, నవంబర్ 30:** గత కొంతకాలంగా, గ్లోబలైజేషన్, టెక్నాలజీ అభివృద్ధి, డిజిటల్ ఎకానమీతో ఉపాధి ప్రపంచంలో పెను మార్పులు చోటు చేసుకున్నాయని..! మనకు తెలిసిన ఉపాధి రంగం కాకుండా కాలనుగుణంగా, మానవ అవసరార్థం ఏర్పడిన నూతన ఉపాధి రంగం, "గిగ్ ఉపాధి" పుట్టుక అవసరాలే ఆవిష్కరణలకు మూలం.. ఈ కొత్త రకం ఉపాధి విధానం ప్రపంచవ్యాప్తంగా భారీ చర్చకు దారి తీసిందని..! గిగ్ కార్మికుల పరిస్థితి, వారికున్న సవాళ్లు, అవకాశాలు ఏమిటి అనే విషయంపై..!సామాజిక వేత్త, సీఎస్ఆర్ రూపకర్త మధుబాబు చికిలే విశ్లేషణాత్మక వివరణతో నేటి "పెన్ పవర్" దినపత్రికలో ప్రత్యేక కథనం..

-2లో





మధుబాబు చికిలే.. సామాజిక. వేత్త..

# లోటస్‌పాండ్‌లో ఎకరం భూమి కబ్జాకు ప్రయత్నిస్తే అడ్డుకున్నాం



- అన్ని పార్టీలకు చెందిన వారు ఆక్రమణలకు పాల్పడ్డారని వ్యాఖ్య
- త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్ రాబోతుందన్న కమిషనర్
- ఆక్రమణదారుల్లో పేదల కంటే ధనికులే ఎక్కువగా ఉన్నారని వెల్లడి

హైదరాబాద్ పెన్ పవర్: హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక ప్రకటన చేశారు. లోటస్ పాండ్‌లో ఎకరం భూమి కబ్జాకు ఒకరు ప్రయత్నించారని, దానిని హైడ్రా అడ్డుకుందన్నారు. బేగంపేటలోని ఓ హోటల్‌లో నిర్వహించిన జాతీయ బయో డైవర్సిటీ అథారిటీ, ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ లోకల్ ఎన్విరాన్‌మెంటల్ ఇనిషియేటివ్ ఆధ్వర్యంలో నిర్వహించిన

-5 లో


# రైతుబంధును శాశ్వతంగా బంద్ చేసే కుట్ర జరుగుతోంది

- రైతుబంధు కంటే రూ. 500 బోనసే మేలని మంత్రి చెబుతున్నారని హరీశ్ మండిపాటు
- రైతుబంధును ఐక్యరాజ్యసమితి కూడా ప్రశంసించిందని వ్యాఖ్య
- రైతుబంధు అమలుపై రేవంత్ క్లారిటీ ఇవ్వాలని డిమాండ్

-5 లో




# గిగ్ కార్మికులు..! సమకాలీన ప్రపంచంలో వారి ప్రాధాన్యత..!









## గిగ్ కార్మికుల విభజన..!

(1)..డిజిటల్ వేదిక కార్మికులు: ఉబర్, ఓలా వంటి డ్రైవర్లు, జొమాటో డెలివరీ సిబ్బంది, అమెజాన్ కార్మికులు.(2).. ఫ్రీలాన్సర్లు: రచయితలు, డిజైనర్లు, డెవలపర్లు మొదలైనవారు, తమ పని స్వతంత్రంగా చేసుకుంటారు.. (3)..సాంకేతిక నైపుణ్యాలు కలిగిన గిగ్ కార్మికులు: డిజిటల్ మార్కెటింగ్, డేటా ఎనాలిసిస్ వంటి విభాగాలలో ప్రత్యేక నైపుణ్యం కలిగి ఉంటారు.

(4)..వృత్తి నైపుణ్యం కలిగిన కార్మికులు: కార్పెంటర్‌లు ప్లంబర్, ఎలక్ట్రీషియన్స్..

## గిగ్ కార్మికుల ప్రాధాన్యత..ఎదుర్కొనే సవాళ్లు..

సౌకర్యవంతమైన పని శైలి: గిగ్ కార్మికులు వారికి నచ్చిన సమయాల్లో పని చేసుకునే అవకాశాన్ని పొందుతున్నారు.. టెక్నాలజీ ప్రభావం మొబైల్ యాప్‌లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్స్, గిగ్ కార్మికుల పనిని సులభతరం చేస్తున్నాయి..

నూతన ఉపాధి అవకాశాలు ఆర్థిక వ్యవస్థలో పలు నూతన ఉద్యోగాలు సృష్టించబడ్డాయి. ఈ విధానం మధ్య తరగతి పేదలుగా మారకుండా కొంచం కాపాడింది.. గిగ్ కార్మికులు ఎదుర్కొనే సవాళ్ళు (1)..ఉద్యోగ భద్రత: గిగ్ కార్మికులకు స్థిరమైన ఉద్యోగ భద్రత లేకపోవడం పెద్ద సమస్యగా మారింది.. (2)..సామాజిక రక్షణల తక్కువ వేతనం: అనేక గిగ్ కార్మికులు పెన్షన్, ఆరోగ్య బీమా వంటి ప్రయోజనాలను పొందలేకపోతున్నారు.. (3)..అనుబంధ హక్కుల కోసం పోరాటం: తమకు కావలసిన వేతనాలు, కార్మిక హక్కుల కోసం చాలా మంది గిగ్ కార్మికులు పోరాడుతున్నారు..

## ప్రైవసీ, డేటా భద్రత..! కార్మిక హక్కుల కోసం పోరాటం..

డిజిటల్ ప్లాట్‌ఫారమ్ తమ గిగ్ కార్మికుల వ్యక్తిగత సమాచారాన్ని ఎలా ఉపయోగిస్తున్నాయి అనే దానిపై కూడా ఆందోళనలు ఉన్నాయి. కార్మికులు తమ డేటా ప్రైవసీ రక్షించబడాలని కోరుకుంటున్నారు.. గిగ్ కార్మికులు, ప్రత్యేకించి ఫుడ్ డెలివరీ యాప్‌లు, క్యాబ్ సర్వీసుల డ్రైవర్లు, తమ హక్కులను గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు. ఊబర్, ఓలా వంటి కంపెనీలు తమను కాంట్రాక్టు కార్మికులుగా గుర్తిస్తూనే, క్రమం తప్పకుండా విధించిన కఠినమైన నిబంధనలతో ఒత్తిడి పెంచుతున్నాయని ఆరోపిస్తున్నారు.

పనిదిన వేళల మరియు పని ఒత్తిడి సమస్యలు..

గిగ్ కార్మికులు ఎక్కువ సమయం పనిచేయాల్సిన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. నిరంతరం ఆర్డర్లు, రైడ్లకు అందుబాటులో ఉండాల్సిన ఒత్తిడిని ఎదుర్కోవడం, పని వేళలు సాధారణ ఉద్యోగాల కంటే అసమానమైనవిగా ఉండడం తదితర అంశాలపై ఆందోళనలు కలిగిస్తున్నాయి..

## తగిన వేతనాల కోసం పోరాటం..

గిగ్ కార్మికులు, ముఖ్యంగా ఫుడ్ డెలివరీ, రైడ్ షేరింగ్ డ్రైవర్లు, తాము అందుకుంటున్న వేతనాలు సరిపోవడం లేదని ఆరోపిస్తున్నారు. బేస్ పేమెంట్ తక్కువగా ఉండడం, డెలివరీలు లేదా రైడ్‌ల మీద మాత్రమే ఆధారపడి ఉన్న ఇన్సెంటివ్ స్ట్రక్చర్లు మరింత ఆర్థిక ఒత్తిడిని కలిగిస్తున్నాయి..ఆర్థిక భద్రత మరియు పెన్షన్ కోసం డిమాండ్‌లు..గిగ్ కార్మికులకు ఆరోగ్య బీమా, పెన్షన్ వంటి భద్రతా వ్యవస్థలు లేవు. దీనివల్ల వారు అనారోగ్యం పాలైతే..! లేదా వృద్ధాప్యంలోకి చేరుకున్నాక భవిష్యత్తు భద్రంగా ఉండదు. ఈ సమస్యలు పరిష్కరించాలనే నినాదాలతో కార్మికులు నిరసనలు చేస్తున్నారు.

## ప్లాట్‌ఫారమ్ కంపెనీల తీరుపై అసంతృప్తి..

కంపెనీలు తమకు సానుకూలంగా ఉండేలా చట్టాలను విధి విధానాలను మార్చుకోవడం, కమిషన్‌లు ఎక్కువగా తీసుకోవడం.. కానీ కార్మికులకు తగిన భద్రతను కల్పించకపోవడం వంటి విషయాలపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు డ్రైవర్లు తమ ప్లాట్‌ఫారమ్ ప్రణాళికలు, రివార్డ్ సిస్టమ్స్ కార్మికులకు అనుకూలంగా ఉండాలని డిమాండ్ చేస్తున్నారు.

- మొదటి పేజీ తరువాయి

గిగ్ వర్కర్స్ అంటే ఎవరు..? గిగ్ ఎకానమీ అంటే ఏమిటి..? ఏ రంగాల కార్మికులను గిగ్ వర్కర్స్ అంటారో చూద్దాం.. ఒక స్వతంత్ర కాంట్రాక్టర్,లేదా ఫ్రీ ల్యాన్సర్‌గా సేవ రంగంలో సాధారణంగా తాత్కాలిక ఉద్యోగాలు చేసే వ్యక్తి గిగ్ వర్కర్.. గిగ్ ఎకానమీ అనేది తాత్కాలిక, అనుబంధ, కాంట్రాక్ట్ ఆధారిత ఉపాధి




విధానం. ఇది సంప్రదాయ ఉద్యోగానికి భిన్నమైనది. ఇక్కడ, కంపెనీలు తాత్కాలిక అవసరాలకు కార్మికులను నియమించుకుంటాయి. ఉదాహరణగా ఫుడ్ డెలివరీ సర్వీస్‌లు (జొమాటో, స్విగ్గీ), క్యాబ్ డ్రైవర్లు (ఉబర్, ఓలా), ఫ్రీలాన్స్ రచయితలు, డిజైనర్లు మొదలైనవి..

## మార్పు కోసం తీసుకోవాల్సిన చర్యలు..

(1)..చట్టాలు రూపొందించడం: భారత ప్రభుత్వం గిగ్ కార్మికులకు సరైన భద్రత కల్పించేలా చట్టాలు తీసుకురావాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి..

(2)..కార్మికుల సంక్షేమ నిధి: హెల్త్ ఇన్సూరెన్స్, ప్రమాద బీమా వంటి సంక్షేమ పథకాలు అమలు చేయాలని సూచనలతో నిరసనలు జరుగుతున్నాయి..

ఈ అంశాల చుట్టూ గిగ్ కార్మికుల ఆందోళనలు సాగుతూనే ఉన్నాయి, అవి ఇండియన్ ఎకానమీపై, టెక్ ఆధారిత ప్లాట్‌ఫారమ్ కంపెనీలపై ప్రభావం చూపుతున్నాయని సామాజిక వేత్త సిటిజన్ సోషల్ రెస్పాన్స్‌బిలిటి రూపకర్త మధుబాబు చికిలే పేర్కొన్నారు..

## ఇటీవల చేపట్టిన ఆందోళనలు..

(1).. డెలివరీ బాయ్స్ ఆందోళన చెందుతున్నారు.. ఫుడ్ డెలివరీ సంస్థల పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్న నేపథ్యంలో కొన్ని ప్రధాన నగరాల్లో డెలివరీ బాయ్స్ సమ్మెచేశారు. డెలివరీల కోసం ఖర్చు ఎక్కువవుతోందని, ఇంధన ధరలు పెరగడంతో ఆదాయం తగ్గిపోతోందని వాదిస్తున్నారు..

(2)..క్యాబ్ డ్రైవర్ల నిరసనలు: ఓలా, ఉబర్ డ్రైవర్లు కొన్ని నగరాల్లో ధర్నాలు నిర్వహించారు. ఇంధన ధరల పెరుగుదలతో కూడిన ఖర్చుల నేపథ్యంలో కస్టమర్ చార్జీలు గణనీయంగా పెంచకపోవడం, తగిన కమిషన్ ఇవ్వకపోవడం వంటి అంశాలు కీలకంగా మారాయి..

## ఇండియాలో గిగ్ ఎకానమీ..!అందుకు కారణాలు..

భారతదేశంలో గిగ్ ఎకానమీ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఫుడ్ డెలివరీ, ఆన్‌లైన్ రిటైల్, రైడ్ షేరింగ్ వంటి రంగాల్లో లక్షల మంది గిగ్ కార్మికులు పని చేస్తున్నారు. దేశంలో నిరుద్యోగ సమస్యను కొంతవరకు తగ్గించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తోంది..

గిగ్ ఎకానమీకి కారణాలు..! (1)..టెక్నాలజీ విప్లవం: స్మార్ట్‌ఫోన్‌లు, ఇంటర్నెట్ విస్తరణ గిగ్ ఎకానమీ అభివృద్ధికి ప్రాధాన్యతను ఇచ్చాయి.. (2)..ఆర్థిక అవసరాలు: ఉద్యోగంలో ఉండే వారి కోసం అదనపు ఆదాయ మార్గాలు.. (3)..ఉపాధి లక్షణాలు మారడం, యువత ఉద్యోగాలపై అన్వేషణ చేస్తూ తమ సౌకర్యార్థం పని చేయాలని కోరుతున్నారు..

## గిగ్ కార్మికుల సంక్షేమం కోసం చర్యలు..!

గిగ్ కార్మికులని అసంఘటిత కార్మికులుగా గుర్తించాలి, అసంఘటిత కార్మికుల సామజిక భద్రత చట్టం -2008 ప్రకారం వారు పొందవలసిన పథకాలు వారికీ అందజేయాలి.. (1)..ప్రత్యేక చట్టాలు: గిగ్ కార్మికుల శ్రేయస్సు కల్పించేలా ప్రత్యేక చట్టాలను రూపొందించడం అవసరం.. (2).. సామాజిక భద్రత కార్యక్రమాలు: ఆరోగ్య బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి వాటిని అందించడం.. (3).. ప్రముఖ కంపెనీల బాధ్యత: గిగ్ కార్మికులను తగిన విధంగా గౌరవించి, వారికి సరైన పారితోషికం ఇవ్వడం..

## తాత్కాలిక వాస్తవాలు..! భవిష్యత్తులో మార్పులు..!

గిగ్ ఎకానమీకి సంబంధించి విపరీతమైన అవకాశాలు ఉన్నాయి కానీ..! దీని స్థిరత్వం ఇప్పటికీ ప్రశ్నార్థకమే. ప్రభుత్వాలు, కంపెనీలు ఈ విషయంలో బలమైన చర్యలు తీసుకోవాలని మధుబాబు చికిలే సూచించారు.. భవిష్యత్‌లో, గిగ్ ఎకానమీ మరింత విస్తరిస్తుందని ఓ అంచనా..! కొత్త ఉపాధి అవకాశాలు, ఆర్థిక వృద్ధి, ఉద్యోగాల విభజనలో ఇది ప్రధాన పాత్ర పోషించవచ్చు. అయితే, గిగ్ కార్మికుల సంక్షేమం కోసం సరైన చర్యలు తీసుకోవడం అనివార్యం..ఇండియాలో గిగ్ కార్మికులు ఇటీవల ఎన్నో ఆందోళనలు నిర్వహించారు.. వీటి వెనుక ఉన్న ప్రధాన కారణాలు, కార్మికుల డిమాండ్‌లు ఈ క్రింది విధంగా ఉన్నాయి..


# మాజీ మంత్రి కేటీఆర్ ప్రధాన అనుచరుడు రామ్మోహన్ అరెస్ట్





**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ప్రధాన అనుచరుడు, బీఆర్ఎస్ కార్యకర్త బొల్లి రామ్మోహన్ అరెస్ట్ అయ్యాడు. శనివారం (నవంబర్ 30) తెల్లవారుజామున రామ్మోహన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసైన్డ్ ల్యాండ్‌లో అక్రమంగా క్రషర్ నిర్వహిస్తున్నారని కలెక్టరేట్ కార్యాలయంలోని ఈ- సెక్షన్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఎమ్మార్వో గుగ్గిళ్ళ వేణు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మార్వో కంప్లైంట్ మేరకు రామ్మోహన్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. కోర్టులో హాజరు పరిచారు. న్యాయస్థానం బొల్లి రామ్మోహన్‌కు14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. కాగా, సిరిసిల్లలో కేటీఆర్ ప్రధాన అనుచరుడుగా ఉన్న రామ్మోహన్.. ట్రాక్టర్ అసోసియేషన్, ఆటో యునియన్ గౌరవ అధ్యక్షుడిగా ఉన్నారు. సిరిసిల్ల పట్టణ బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడిగా కూడా ఆయన కొనసాగుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇసుక, మాఫియా, ల్యాండ్ కబ్జాలు చేస్తూ కోట్ల రూపాయలు దండుకున్నట్లు రామ్మోహన్ పై పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి.

# రైతులకు ప్రభుత్వం గుడ్ న్యూస్.. రూ.2 లక్షల రుణమాఫీ నిధులు విడుదల




**హైదరాబాద్ పెన్ పవర్:** రూ.2 లక్షలు రుణమాఫీ కాని రైతులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. వివిధ కారణాల వల్ల ఇప్పటి వరకు రుణ మాఫీ కాని రైతుల కోసం తాజాగా రూ.2,747.67 కోట్ల నిధులు ప్రభుత్వం విడుదల చేసింది. లబ్ధిదారులకు రుణమాఫీ ప్రాసెస్‌లో నెలకొన్న టెక్నికల్ సమస్యలను పరిష్కరించి రుణమాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటి వరకు రుణమాఫీ కాని 3.14 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,747.67 కోట్లు ప్రభుత్వం జమ చేయనుంది. ప్రభుత్వ నిర్ణయంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.కాగా, తెలంగాణలో అధికారంలోకి వస్తే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కాంగ్రెస్.. ఎన్నికల్లో మాట ఇచ్చినట్లుగానే రెండు విడతల్లో రుణమాఫీ చేసింది. అయితే, సాంకేతిక కారణాలు, వివిధ కారణాల వల్ల కొందరు అర్హులకు రుణమాఫీ జరగలేదు. అర్హులైన 3.14 లక్షల మంది రైతులకు రుణమాఫీ నిధులు కాలేదు. దీంతో టెక్నికల్ సమస్యలను పరిష్కరించిన ప్రభుత్వం.. తాజాగా మిగిలిన రైతులకు పంట రుణమాఫీ నిధులు విడుదల చేసింది.

## ORR అమ్మేసి రైతు బంధు.. బీఆర్ఎస్‌పై నిప్పులు చెరిగిన మంత్రి జూపల్లి






**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఆర్ఆర్ఆర్‌ను అమ్మేసి గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు పథకం అమలు చేసిందని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. ప్రజా పాలన-ప్రజా విజయోత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు మహబూబ్ నగర్‌లో ప్రభుత్వం రైతు పండగ కార్యక్రమం నిర్వహించింది. ఇందులో భాగంగా శనివారం (శనివారం 30) రైతు పండగ ముగింపు వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ధనిక రాష్ట్రాన్ని అప్పులమయం చేసిందెవరు..? నెలకు రూ.6 వేల వడ్డీలు కట్టాల్సిన పరిస్థితి తెచ్చిందెవరు..? అంటూ బీఆర్ఎస్ ను విమర్శించారు. గత ప్రభుత్వ బీఆర్ఎస్ తీరు వల్ల రాష్ట్రంలో అప్పుల్లో కూరుకుపోయిన..

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ అమలు చేశామని చెప్పారు. ప్రభుత్వానికి భారీగా అప్పులున్నప్పటికీ రైతుల కోసం రూ.2 లక్షల రుణమాఫీ చేశామని తెలిపారు. రుణమాఫీ కోసం ఇప్పటికే రూ.18 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం.. మిగిలిన వారికి త్వరలోనే రైతు రుణమాఫీ నిధులు విడుదల చేస్తామని పేర్కొన్నారు.

## ఏదేమైనా రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతాం: మంత్రి తుమ్మల





**హైదరాబాద్ పెన్ పవర్:**రైతు రుణమాఫీపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఏదైమైనా ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా రైతులకు రూ.2 లక్షల పంట రుణమాఫీ చేసి తీరుతామని ప్రకటించారు. కొన్ని సమస్యల వల్ల రుణమాఫీ వర్తించని వారిని గుర్తించి మళ్లీ రుణమాఫీ చేస్తున్నామని తెలిపారు. ప్రజా పాలన-ప్రజా విజయోత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు మహబూబ్ నగర్ లో ప్రభుత్వం రైతు పండగ కార్యక్రమం నిర్వహించింది. ఇందులో భాగంగా శనివారం (శనివారం 30) రైతు పండగ ముగింపు వేడుక నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. గత పదేళ్లలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయ్యింది.. ఆర్థికంగా ఆగమైనా రాష్ట్రాన్ని మేం అధికారంలోకి వచ్చాక చక్కదిద్దుకుంటూ వస్తున్నామని తెలిపారు. గత బీ ఆర్ఎస్ ప్రభుత్వం పెండింగ్ లో పెట్టిన రూ.7వేల కోట్ల రైతు భరోసాను మా ప్రభుత్వమే చెల్లించిందని చెప్పారు. బీఆర్ఎస్ పూర్తి చేయలేకపోయిన రుణమాఫీని కూడా మేమే పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్రంలో వరి ధాన్యాన్ని పకడ్బందీగా కొనుగోలు చేస్తున్నామన్నారు.

## ఆసిఫాబాద్‌లో రైతుపై పులి దాడి..





**హైదరాబాద్ పెన్ పవర్:**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పత్తి చేనులో పని ఏరుతున్న మహిళపై రెండు రోజుల క్రితం పులి దాడి చేసి చంపేసింది. సరిగ్గా రెండు తర్వాత.. ఈ రోజు (నవంబర్ 30) అదే తరహాలో సిర్పూర్ టౌన్ దుబ్బగూడ గ్రామంలో మరో దాడి జరిగింది. దుబ్బగూడ గ్రామ శివారులో పత్తి ఎరుతుండగా రైతుపై పులి దాడి చేసింది. రౌత్ సురేష్ అనే రైతుపై పులి అటాక్ చేసింది. సురేష్ కు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స కోసం హాస్పిటల్ కు తరలించారు. అధికారులు చుట్టుపక్కల గ్రామలకు హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలకు భయంతో బిక్కుబిక్కు మంటూ గడుపుతున్నారు. ఫారెస్ట్ అధికారులు అప్రమత్తమై పులులు గ్రామాల్లోకి రాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

# జనవరి 11నే అయోధ్య వార్షికోత్సవం



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత దేశం లోనే కాదు ప్రపంచంలో ఉన్న హిందువుల స్వప్నం అయోధ్యలో రామాలయ నిర్మాణం. 500 ఏళ్లుగా రామాలయ నిర్మాణం కోసం జరిగిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఎట్టకేలకు అయోధ్యలో రామ మందిర నిర్మాణంపై సుప్రీం కోర్టు తీర్పు వెల్లడించడంతో రెండేళ్ల క్రితం ఆలయ నిర్మాణం ప్రారంభించారు. 2022 డిసెంబర్ నాటికి మొదటి దశ నిర్మాణం పూర్తయింది. దీంతో 2023, జనవరి 22న ఆలయంలో బాలరాముడి విగ్రహం ప్రతిష్ఠాపనోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేశంలోని ప్రముఖులతోపాటు విదేశాల నుంచి కూడా ప్రముఖులు తరలివచ్చారు. బాల రాముడిని దర్శించుకుని తరించారు. పూర్తిగా విరాళాలతో ఈ ఆలయం నిర్మించారు. ప్రధాని నరేంద్రమోదీ బాలరాముని ప్రాణప్రతిష్ఠ నిర్వహించారు. అప్పటి నుంచి నిత్యం వేల మంది భక్తులు అయోధ్య వెళ్లి రామయ్యను దర్శించుకుంటున్నారు. ఆలయం ప్రారంభించి మరో రెండు నెలల్లో ఏడాది పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో వార్షికోత్సవం నిర్వహణ కోసం శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ అధ్యక్షతన ఇటీవల సమావేశం నిర్వహించారు. రామాలయ వార్షికోత్సవ వేడుకల నిర్వహణపై నిర్ణయం తీసుకున్నారు. వార్షికోత్సవ వేడుకలను జనవరి 22న కాకుండా జనవరి 11నే నిర్వహించాలని నిర్ణయించారు. పది రోజుల ముందే వేడుకల నిర్వహణ వెనుక కారణం ఉందని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఈ సమావేశంలో ఏ రోజు ఏ ఉత్సవం నిర్వహించాలో నిర్ణయం తీసుకున్నారు. రామాలయ వార్షికోత్సవాన్ని హిందూ క్యాలెండర్ ప్రకారం నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. పుష్య శుక్ల ద్వాదశి అంటే కూర్మ ద్వాదశి రోజు ఉత్సవం జరుపుకోవాలని పండితులు తెలిపారు. అంటే ఇంగ్లిష్ క్యాలెండర్ 2025, జనవరి 11న ఈ తిథి వస్తుంది. దీని ప్రకారమే అయోధ్యలో నూతన రామాలయ, బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ వార్షికోత్సవం నిర్వహించాలని తీర్మానించారు. శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ వేడుకలకు ఏర్పాట్లు చేయాలని కూడా సమావేశంలో నిర్ణయించారు.

# మొగుడ్ని చంపి... ఆత్మహత్యగా చిత్రీకరించి...

**హైదరాబాద్ పెన్ పవర్:** నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి తూడుకుర్తిలో దారుణ సంఘటన చోటుచేసుకుంది. ప్రియుడు మోజులో పడి కట్టుకున్న భర్తనే దారుణంగా హత్య చేసి కాలువలో పడేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది భార్య.. చివరకు పోలీసులు ఎంటర్ అవ్వడంతో అసలు కథ వెలుగులోకి వచ్చింది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్ కర్నూల్ మండలం తూడుకుర్తికి చెందిన చింతలపల్లి జగదీష్ (35)బిజినపల్లి మండల ఎంపీడీవో కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. 2011లో గద్వాల్ కు చెందిన కీర్తి ని ప్రేమ వివాహం చేసుకొని నాగర్ కర్నూల్‌లో నివాసం ఉంటున్నారు. తన భార్య కీర్తి వాః అనే రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థలో పనిచేస్తోంది. అక్కడే బిజినపల్లి మండలం గుడ్ల నర్వ గ్రామానికి చెందిన నాగరాజు అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది.. అది కాస్త వారి మధ్య ప్రేమ, వివాహేతర సంబంధానికి దారి తీసింది. విషయం తెలిసిన భర్త? భార్యను గట్టిగా మందలించాడు. దీంతో అసలు విషయం ఇంట్లో తెలిసిందని.. దీంతో ప్రియుడు దూరమవుతున్నాడని భావించి.. ఏకంగా భర్త అడ్డును తొలగించుకోవాలని ప్లాన్ వేసింది. ఈ నేపథ్యంలో కొన్ని రోజుల క్రితం బిజినపల్లి మండల కేంద్రంలో ప్రియుడితోపాటు మరో వ్యక్తితో కలిసి భర్తపై దాడి చేయించింది. ఈ సారి ప్రియుడిని వదిలించుకోవాలని.. లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొవలసి ఉంటుందని భర్త గట్టిగా హెచ్చరించాడు. దీంతో ఎలాగైనా భర్తను అడ్డు తొలగించుకోవాలని దారుణానికి తెగించింది. భర్త జగదీష్‌ను దైవ దర్శనం పేరుతో గద్వాల్ లోని తన తల్లిగారి ఇంటికి తీసుకెళ్ళింది భార్య కీర్తి. అక్కడ నాగరాజు తీసుకువచ్చిన మత్తు మందు కలిపిన కల్లును జగదీష్ తో తాగించారు. జగదీష్ స్పృహ కోల్పోయిన తర్వాత కారులో తూడుకుర్తి గ్రామ శివారులోని జగదీష్ వ్యవసాయ బావి వద్దకు తీసుకెళ్లారు. మొదట అక్కడే కరెంట్ షాక్ తో చంపాలని భావించారు. సమయానికి కరెంట్ లేకపోవడంతో ప్లాన్ మార్చారు. ఐబీ కాల్వలో తోసేశారు.. అంతటితో ఆగకుండా జగదీష్ ను నీళ్లలో ముంచి దారుణంగా హతమార్చారు. ఇక మరునాడు తన భర్త కనిపించడం లేదంటూ ఏమి ఎరుగనట్లు నటించింది భార్య కీర్తి. రెండు రోజుల తర్వాత బిజినపల్లి మండలం అల్లిపూర్ గ్రామ శివారులో కాలువలో భర్త జగదీష్ మృతదేహం లభించింది. ఈ విషయంలో మృతిపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు భార్యని అదుపులో తీసుకొని విచారించగా అసలు గుట్టు రట్టయింది. హత్యకు వివాహేతర సంబంధమే కారణం అంటూ పోలీసులు తేల్చారు. మృతుడి భార్య కీర్తి, అత్త, బావమరిది, నాగరాజుతో పాటు మొత్తం ఏడుగురు నిందితులను గుర్తించి.. ఆరుగురిని అరెస్టు చేశారు. మత్తుమందు అందించిన వ్యక్తి మోహన్ గౌడ్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.. ఈ ఘటన స్థానికంగా సంచలనంగా మారింది..

## డివైడర్ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు.. ప్రయాణికులకు గాయాలు




**హైదరాబాద్ పెన్ పవర్:** సంగారెడ్డి – జోగిపేట మండలం నేరడి కుంట శివారులో నేషనల్ హైవేపై ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డుపై డివైడర్ను ఢీకొట్టడంతో పలువురు గాయపడ్డారు. నారాయణఖేడ్ నుంచి హైదరాబాదుకు 45 మందితో ఆర్టీసీ బస్సు వెళ్తున్న క్రమంలో బస్సు అదుపుతప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ను ఢీకొట్టగా పెను ప్రమాదం తప్పిందని తెపారు.

## వణికిపోతున్నారు.... పడిపోయిన టెంపరేచర్



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో చలి తీవ్రత పెరిగింది. రోజురోజుకూ చలి గాలులు ఎక్కువగా వీస్తున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి కూడా భయపడిపోతున్నారు. తెలంగాణ వ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా తెలంగాణలో చలి తీవ్రత చంపేస్తుంది. చేతులు కూడా గడ్డకట్టుకుని పోయే విధంగా చలి తీవ్రత ఉండటంతో ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. మరి కొద్ది రోజుల పాటు చలి తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావం వల్ల చలిగాలుల తీవ్రత ఎక్కువయిందని అంటున్నారు.. హైదరాబాద్ నగరంలోనూ చలి తీవ్రత ఎక్కువగా ఉంది. పటాన్ చెర్వులో 12.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఉదయాన్నే విధులకు వెళ్లాల్సిన ఉద్యోగులతో పాటు వ్యాపారులు కూడా ఆలస్యంగా బయలుదేరుతున్నారు. సూర్యుడు కూడా ఉదయం పన్నెండు గంటలకు గాని బయటకు కనిపించడం లేదు. మార్నింగ్ వాకర్స్ కూడా చలి ఇబ్బంది పెడుతుండటంతో బయటకు రావడం లేదు. అదే సమయంలో ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు చలిగాలుల తీవ్రతకు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే చలిగాలుల తీవ్రత పెరిగినందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. హైదరాబాద్‌లో చలితీవ్రత పెరిగింది. ఆదిలాబాద్ 9.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదయింది. మెదక్ 11.4, పటాన్ చెరులో 12.2 డిగ్రీలు, హనుమకొండ 13.5, రామగుండం 13.8 డిగ్రీలు. నిజామాబాద్‌లో 14.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. చలిగాలుల తీవ్రత ఎక్కువ కావడంతో ప్రజలు అనేక రకాల వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రధానంగా జలుబు, దగ్గు, జ్వరంతో పాటు వైరల్ ఫీవర్లు కూడా నమోదవుతున్నాయి. అనేక ఆసుపత్రుల్లో ఇప్పటికే అనేక మందిచికిత్స పొందుతున్నారు. గుండె సంబంధిత వ్యాధులు కూడా ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో చేరే వారి సంఖ్య ఎక్కువగా కనిపిస్తుంది. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాకపోవడమే మంచిదని సూచిస్తున్నారు.

# కానిస్టేబుల్ ఇంట్లో గంజాయి!

- సీజ్ చేసిన గంజాయిని కాజేస్తూ బయట అమ్మకం
- కాజీపేట డివిజన్ లో కానిస్టేబుల్ నిర్వాకం
- అదుపులోకి తీసుకుని విచారిస్తున్న ఉన్నతాధికారులు



**హైదరాబాద్ పెన్ పవర్:**మత్తు పదార్థాల వాడకాన్ని అరికట్టే బాధ్యత నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్ డబ్బు కోసం అక్రమ మార్గం పట్టాడు. ఓ రెయిడ్ లో దొరికిన గంజాయిని సీజ్ చేసి ఠాణాలో పెట్టగా.. సదరు కానిస్టేబుల్ గుట్టు చప్పుడు కాకుండా దశల వారీగా కాజేస్తూ వచ్చాడు. ఇలా కాజేసిన గంజాయిని తన స్నేహితులు, బంధువుల సాయంతో విద్యార్థులకు అమ్ముతూ సొమ్ము చేసుకున్నాడు. కాజీపేట పోలీస్ డివిజన్ కరీంనగర్ రోడ్ లోని ఠాణాలో చోటుచేసుకుందీ అక్రమం. ఉన్నతాధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం...నర్సంపేటకు చెందిన కానిస్టేబుల్ ఈ ఠాణాలో విధులు నిర్వహిస్తున్నాడు. గతంలో ఓ రెయిడ్ లో పెద్ద మొత్తంలో పట్టుబడ్డ గంజాయిని అధికారులు ఇదే ఠాణాలో సీజ్ చేసి పెట్టారు. దీనిపై కన్నేసిన సదరు కానిస్టేబుల్.. దశల వారీగా గంజాయిని ఇంటికి తీసుకెళ్లాడు. తన స్నేహితులు, బంధువులకు ఇచ్చి అమ్మించాడు. ఈ క్రమంలో నర్సంపేట నుంచి వరంగల్ వచ్చే మార్గంలో వాహనాల తనిఖీ చేపట్టగా ఓ బైక్ పై వచ్చిన యువకులు పారిపోయే ప్రయత్నం చేశారు. వెంబడించి పట్టుకున్న పోలీసులు వారిని సోదా చేయగా గంజాయి లభ్యమైంది. ఆ తర్వాత విచారణలో కానిస్టేబుల్ పేరు బయటకు వచ్చింది. దీంతో ఉన్నతాధికారులకు సమాచారం అందించి సదరు కానిస్టేబుల్ ఇంట్లో సోదాలు నిర్వహించగా తస్కరించిన గంజాయి దొరికింది. ప్రస్తుతం కానిస్టేబుల్ ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

## మేడ్చల్ సీసీఐ గోదాంలో భారీ అగ్ని ప్రమాదం... కోట్లలో ఆస్తి నష్టం

- పత్తి గోదాంలో భారీగా ఎగిసిన మంటలు
- ఫైరింజన్ల సాయంతో మంటలను ఆర్పే ప్రయత్నం
- భారీ ప్రమాదం కారణంగా కుప్పకూలిన గోదాం



**హైదరాబాద్ పెన్ పవర్:**మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పూడూరు గ్రామంలో కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి నిల్వ గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పత్తి గోదాంలో భారీగా మంటలు ఎగిసిపడి చుట్టుపక్కల పొగలు వ్యాపించాయి. ఈ ప్రమాదం కారణంగా కోట్లాది రూపాయల నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు. ప్రమాదం విషయం తెలియగానే అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుంది. ఫైరింజన్ల సాయంతో మంటలను ఆర్పే ప్రయత్నం చేసింది. భారీ ప్రమాదం కావడంతో గోదాం కుప్పకూలింది. మంటలను గమనించిన కార్మికులు గోదాం నుంచి బయటకు పరుగు తీశారు. దీంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

# ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ యువతిని కాపాడిన పోలీసులు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న మహిళ ప్రాణాలను పోలీసులు కాపాడారు. × తన సోదరి ఆత్మహత్యాయత్నం చేసుకుంటు ఉంది అని బెంగళూర్ నుండి తిరుపతి పోలీస్ కంట్రోల్ రూమ్ కు వాట్సప్ ద్వారా ఫిర్యాదు వచ్చింది. సకాలంలో పోలీసుల బృందం స్పందించి టీటీడి విజిలెన్స్ సహాయంతో సత్వర చర్యలు తీసుకోవడంతో ప్రాణనష్టం తప్పింది. తక్షణ స్పందనతో నిండు ప్రాణాలు కాపాడి ప్రాణం పోసారు. కుటుంబ వ్యక్తిగత కారణాలతో మహిళ ఆత్మహత్యాయత్నం చేనసినట్లు సమాచారం. ఫోన్ నెంబర్ ఆధారంగా లొకేషన్ గుర్తించి, టీటీడి విజిలెన్స్ వారి సహకారంతో మెట్టు మార్గంలో గుర్తించి కాపాడారు.

## లోటస్‌పాండ్‌లో ఎకరం భూమి కబ్జాకు ప్రయత్నిస్తే అడ్డుకున్నాం

- మొదటి పేజి తరువాయి

జాతీయ సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పార్టీలకతీతంగా అన్ని పార్టీలకు చెందిన వారు కూడా ఆక్రమణలకు పాల్పడ్డారన్నారు.
త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్ రాబోతుందని వెల్లడించారు. ఎక్కువగా సంపన్నులే ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. వివిధ ప్రాంతాల్లో పరిశీలించాక తెలిసిందేమంటే ఆక్రమణలకు గురైన స్థలాల్లో పేదల కంటే ధనికులే ఎక్కువగా ఉన్నారన్నారు. హైడ్రాకు వచ్చే ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రభుత్వ స్థలాలను, చెరువులను ఆక్రమిస్తే ఎవరినీ వదిలేది లేదని తేల్చి చెప్పారు.

## రైతుబంధును శాశ్వతంగా బంద్ చేసే కుట్ర జరుగుతోంది

**హైదరాబాద్ పెన్ పవర్:** రైతుబంధు పథకాన్ని శాశ్వతంగా బంద్ చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. రైతుబంధు కంటే రూ. 500 బోనసే మేలని రైతులు చెబుతున్నారంటూ వ్యవసాయశాఖ మంత్రి చెప్పడం దారుణమని అన్నారు. రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించే రైతుబంధు పథకాన్ని ఐక్యరాజ్యసమితి కూడా ప్రశంసించిందని గుర్తు చేశారు. అలాంటి గొప్ప పథకాన్ని ఒక ప్రణాళిక ప్రకారం తొలగించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రైతుబంధును బంద్ చేస్తారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముందే హెచ్చరించారని హరీశ్ రావు అన్నారు. కేసీఆర్ చెప్పినట్టుగానే రేవంత్ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తోందని చెప్పారు. రైతుబంధును తొలగించే కుట్రను బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. ఈరోజు మహబూబ్ నగర్ లో నిర్వహించే కార్యక్రమంలో రైతుబంధు అమలుపై రేవంత్ రెడ్డి క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న వానాకాలం రైతుబంధుతో పాటు... యాసంగికి పంట పెట్టుబడి సాయం వెంటనే విడుదల చేయాలని అన్నారు.

## గురుకుల పాఠశాలలను సందర్శించిన బిజెపి నేత అందేలా శ్రీరాములు యాదవ్

**హైదరాబాద్ పెన్ పవర్:**మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఉన్నటువంటి కందుకూరు మండల గురుకుల పాఠశాలను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ సందర్శించారు. అనంతరం అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ తో మాట్లాడి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు . అనంతరం శ్రీరాములు మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. నిత్యం ఏదో ఒక గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారంతో కొందరు, అనారోగ్యంతో ఇంకొందరు, అలాగే ఆత్మహత్యకు పాల్పడుతూ మరణిస్తున్నారని ఆయన ఆ రోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన సంవత్సర కాలంలో 51 విద్యార్థులను పొట్టన పెట్టుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, గురుకులాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమీక్షించాలి అని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను తెలుసుకొని తక్షణమే పరిష్కరించాలనీ, ప్రతి గురుకులాలలో మంచినీటి సరఫరా , స్నానపు గదులు, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలన్నారు. జిల్లాలో ఉన్నటువంటి అన్ని గురుకుల పాఠశాలలకు జిల్లా కలెక్టర్ స్థానికంగా ఉన్నటువంటి నాయకులతో కలిసి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని శ్రీరాములు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి నేతలు పాల్గొన్నారు.

## ఎంపి అవినాష్ రెడ్డి అనుచరుల ఆధీనంలోని కార్లు స్వాధీనం

**హైదరాబాద్ పెన్ పవర్:**ఎంపి అవినాష్ రెడ్డి అనుచరుల ఆధీనంలో ఉన్న కార్లను సంగారెడ్డి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని సంగారెడ్డి పోలీస్ స్టేషన్ కు తరలించారు. 2020లో సంగారెడ్డి లోని హరిహర ట్రావెల్స్ యజమాని సతీష్ వద్ద ఆరు కార్లను వికారాబాద్కు చెందిన మణిరాజ్ అద్దెకు తీసుకున్నాడు. కొంతకాలం తర్వాత మణిరాజ్ తన ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నాడు. ఈ ఆరు కార్లు పులివెందులలో ప్రత్యక్షం అయ్యాయి. ఎంపీ అవినాష్ రెడ్డి అనుచరులు ఈ కార్లను వాడుతున్నారు. మూడు సంవత్సరాల క్రితం సంగారెడ్డి పోలీస్ స్టేషన్లో కార్ల అదృశ్యంపై సతీష్ ఫిర్యాదు చేసాడు. మూడు సంవత్సరాలుగా సమస్య కొలిక్కిరాలేదు. చివరకు సతీష్ తనకు న్యాయం చేయాలంటూ ఏపీ ప్రభుత్వానికి మొరపెట్టుకున్నాడు. స్పందించిన ఎపి ప్రభుత్వం పులివెందుల పోలీసుల ద్వారా సంగారెడ్డి పోలీసులకు కార్లను అప్పగించింది. శుక్రవారం రాత్రి ఆరు కార్లను స్వాధీనం చేసుకుని సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్కు కార్లను తరలించారు.

## అమెరికా కాల్పుల్లో ఖమ్మం యువకుడు మృతి



**ఖమ్మం పెన్ పవర్::** ఖమ్మం నగరానికి చెందిన యువకుడు సాయి తేజ ను అమెరికా లో నల్ల జాతీయులు కాల్చి చంపారు. మృతుడు నాలుగు నెలల క్రితం అమెరికా లో చదువుకునేందుకు వెళ్లాడు. నూకారపు కోటేశ్వర రావు దంపతులకు ఇద్దరు సంతానం కాక అమ్మాయి అబ్బాయి ఇద్దరు కూడా అమెరికాలో ఉంటారు. ఓ స్టోర్ లో క్యాష్ కౌంటర్ దగ్గర పార్ట్ టైం జాబ్ చేస్తున్న సాయి తేజ ని కొందరు దుండగులు వచ్చి డబ్బులు అడగగా ఇచ్చిన కూడా కాల్చి చంపి వెళ్లారని తల్లీదండ్రులు కన్నీరు పెట్టుకున్నారు.

## విద్యార్థినిలపై టీచర్ లైంగిక వేధింపులు బంధువుల అందోలన

**నల్గోండ పెన్ పవర్::** నల్లగొండ జిల్లా నిడమనూరు మోడల్ స్కూల్ లో దారుణం జరిగింది. విద్యార్థినిలపై సోషల్ టీచర్ ఆంజనేయులు లైంగిక వేధింపుల భాగోతం బయటపడింది. తనతో అసభ్యంగా ప్రవర్తించాడని ఏడవ తరగతి విద్యార్థిని ప్రిన్సిపాల్ కు ఫిర్యాదు చేసింది. విషయం తెలిసి స్కూల్ ముందు విద్యార్థినిల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు.

## పెద్ద పులి దాడిలో యువకుడికి తీవ్ర గాయాలు



**హైదరాబాద్ పెన్ పవర్:**కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ టీ) మండలం దుబ్బగూడా గ్రామ సమీపంలో పత్తి చేనులో పత్తి ఏరుతుండగా అదే గ్రామానికి చెందిన రౌతు సురేష్ అనే యువకునిపై పెద్దపులి దాడి చేసింది. ఘటనలో సురేష్ కు తీవ్ర గాయాలు అయ్యాయి. అతడిని సిర్పూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# కొమురం భీం జిల్లాలో హడలెత్తిస్తున్న పెద్దపులి

- నాలుగేళ్లలో నలుగురిని చంపిన పులి
- శుక్రవారం పులి దాడిలో మరో మహిళ మృతి
- నిత్యం పశువుల మందపై దాడులు
- పలు ప్రాంతాల్లో వన్ ఫార్టీ ఫోర్ సెక్షన్



**హైదరాబాద్ పెన్ పవర్:**కొమరం భీమ్ జిల్లాలోనీ పలు మారుమూల అటవీ సమీప ప్రాంతాలలో గడిచిన నాలుగు సంవత్సరాల నుండి పెద్దపులి హడలెత్తిస్తుందని చెప్పవచ్చు. సదరు పెద్దపులి గడిచిన ఈ నాలుగేళ్ల కాలంలో నలుగురిని పొట్టన పెట్టుకున్నది.గత కొన్నిరోజులుగా పశు వుల మందలపై దాడులు చేస్తున్న పులి.. శు క్రవారం ఉదయం ఓ యువతిని చంపేసింది. కాగజ్నగర్ మండలం గన్నారంలో ఉదయం 8.30 గంటల సమయంలో పత్తి ఏరుతున్న మోర్లె లక్ష్మిపై దాడి చేసింది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడి మృతిచెందింది. ఈ నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు అలర్ట్ అయ్యారు. దాడి జరిగిన ప్రాంతానికి దగ్గరలోనే పులి సంచరిస్తున్నట్లు నిర్ధరించారు. ఈ నేపథ్యంలో కాగజ్నగర్ మండలంలోని పలు గ్రామాల్లో ఆంక్షలు విధించారు. ఈజ్గామ్, నజ్రూల్ నగర్, సీతానగర్, అనుకోడా, గన్నారం, కడంబా, ఆరెగూడ, బాబూనగర్, చింతగూడ గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. ఆయా గ్రామాల ప్రజలు పంట చేలకు, అటవీ ప్రాంతాలకు వెళ్లకుండా 144 సెక్షన్ విధించారు. దాడి చేసిన చోటుకే పులి మళ్లీ వచ్చే అవకాశం ఉందని, అటువైపు ఎవ్వరూ వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

జిల్లాలోని అటవీ ప్రాంత గ్రామాల్లో సంచరిస్తున్న పులులు ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. నిత్యం ఎక్కడో చోట పశువుల మందలపై పంజా విసురుతూ దడ పుట్టిస్తున్నాయి. నాలుగేళ్ల క్రితం దహెగాం మండలం దిగడ గ్రామానికి చెందిన విగ్నేశ్ను, పెంచికల్పేట్ మండలం కొండపల్లి గ్రామానికి చెందిన పసుల నిర్మలను, గతేడాది వాంకిడి మండ లం ఖానాపూర్కు చెందిన రైతు సిడాం భీము ను పొట్టనబెట్టుకోగా, ఆ ఘటనలు మరవకముందే శు క్రవారం ఓ పులి మరో మహిళను బలి తీసుకున్నది.

**పత్తి ఏరుతుండగా దాడి..**

కాగజ్నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన మోర్లె లక్ష్మి (22) .. శుక్రవారం మరో 20 మంది కూలీలతో కలిసి సమీపంలోని చేనులో పత్తి ఏరేందుకు వెళ్లింది. ఉదయం 8.30 గంటల ప్రాంతంలో అందరూ పనిలో నిమగ్నం కాగా.. పెద్ద పులి ఒక్కసారిగా మోర్లె లక్ష్మిపై దాడి చేసింది. కూలీలు కేకలు వేయడంతో అది అక్కడి నుంచి వెళ్లిపోయింది. లక్ష్మిని వెంటనే పట్టణంలోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

**ఇప్పటి వరకు నలుగురు**

జిల్లాలో పులుల దాడుల్లో ఇప్పటి వరకు నలుగురు మృతి చెందారు. 2020 నవంబర్ 11న దహెగాం మండలం దిగిడ గ్రామానికి చెందిన విగ్నేష్ చేపల వేటకు వెళ్లగా, పులి దాడి చేయడంతో మృతి చెందాడు. 2020 నవంబర్ 29న పెంచికల్పేట్ మండలం కొండపల్లి గ్రామానికి చెందిన పసుల నిర్మల (15) పత్తి ఏరుతుండగా, పెద్ద పులి దాడిచేసి చంపేసింది. అలాగే 2023 నవంబర్ 16న వాంకిడి మండలం ఖానాపూర్కు చెందిన రైతు సిడాం భీము తన చేనులో పత్తి ఏరుతుండగా పులి పంజా విసరడంతో మృత్యువాత పడ్డాడు. తాజాగా.. శుక్రవారం గన్నారంలో పత్తి ఏరుతున్న మహిళపై పులి దాడి చేసి చంపడం స్థానికంగా కలకలం రేపుతున్నది. కాగా, ఉమ్మడి జిల్లాలో పులుల దాడుల దడపుట్టిస్తున్నాయి. ఈ ఏడాది దాదాపు 40 వరకు పశువులపై దాడులు చేశాయి. ఎప్పుడు ఏ వైపు నుంచి వచ్చి దాడులు చేస్తాయోనని ప్రజలు వణికిపోతున్నారు. దీంతో పలువురు రైతులు తమ పంట పొలాల వైపు వెళ్లాలంటేనే హడలెత్తిపోతున్నారు.

# పరిపాలనను గాలికొదిలేసిన ప్రభుత్వం

- ప్రతిపక్షాలపై దాడులకే ప్రాముఖ్యత ఇస్తుండ్లు
- రేవంత్ సర్కార్లో గురుకులాలపై నమ్మకం సన్నగిల్లుతోంది
- పేద బిడ్డలు చదువుకునే పాఠశాలలను బలోపేతం చేయాలి
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్




**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పరిపాలనను గాలికి వదిలేసిందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి పిలుపు మేరకు శనివారం ముత్తారం మండలంలోని కస్తూర్బా పాఠశాలను ఆయన సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్తూర్బా పాఠశాలలో కొన్ని సమస్యలు పరిష్కారం అయినా మరికొన్ని సమస్యలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఒక విద్యార్థి ఆస్వస్థతకు గురై ఉందని, ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నామన్నారు. రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వం పరిపాలనను మరిచి ప్రతిపక్షాలపై దాడులకు ప్రాముఖ్యత ఇస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్తారో ఏడాదైన ఒక విధానం చెప్పడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో గురుకులాలు, మోడల్ స్కూల్లలో విద్యార్థులను చేర్పిందుకు రికమండేషన్లు ఉండేవని, కానీ ఈనాడు రేవంత్ సర్కార్లో గురుకులాలు, మోడల్ స్కూల్లపై నమ్మకం సన్నగిల్లుతోందని, గురుకుల పాఠశాలల నుంచి విద్యార్థులకు వెళ్లిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గురుకుల పాఠశాలలు,మోడల్ స్కూల్ల్లో అన్ని వసతులు కల్పించి బలోపేతం చేసే దిశగా అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందని, ప్రస్తుతం మోడల్ స్కూల్స్లో వంట గదులు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. అట్టడుగు వర్గాలకు చెందిన పేదింటి విద్యార్థులు చదువుకునే గురుకులాలు, మోడల్ స్కూల్ల బలోపేతం చేయాలని, మంచి వాతావరణం, నాణ్యమైన బోజనం అందించేలా సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఆహార నాన్యాతపై కమిటీలు

హైదరాబాద్ పెన్ పవర్:సంక్షేమ వసతి గృహాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఆహార భద్రతా, నాణ్యతా ప్రమాణాలు తనిఖీ కోసం జిల్లా, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తూ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, గిరిజన, బీసీ, మైనారిటీ సంక్షేమ, మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, పాఠశాల విద్య నియంత్రణలో వివిధ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలలో ఆహార నాణ్యతలను నిర్ధారించడానికి టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కమిటి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ విద్యాసంస్థలు, అంగన్‌వాడీలు, ఆసుపత్రులు మరియు ప్రభుత్వం ఆహారం అందించే ఇతర ప్రదేశాలలో ఆహార భద్రత కోసం జిల్లా స్థాయి కమిటీలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్,
రెవెన్యూ డివిజనల్ అధికారి,
జిల్లా పౌర సరఫరాల అధికారి,
జిల్లా వ్యవసాయ అధికారి,
ఎస్సి, ఎస్టీ, బిసి, మైనారిటీసంక్షేమ శాఖల అధికారులు, ఫుడ్ ఇన్స్పెక్టర్ తో జిల్లా స్థాయి కమిటి ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

అలాగే కాటారం రెవెన్యూ డివిజన్ కు సంబంధించి రెవెన్యూ
అదనపు కలెక్టర్ అధ్యక్షతన పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్,
జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి,
జిల్లా సహకార అధికారి
జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి,
ఫుడ్ ఇన్స్పెక్టర్ తో కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మండల స్థాయి కమిటీ కూడా క ఏర్పాటు చేయబడింది. ఈ కమిటీలో మండల ప్రత్యేక అధికారి చైర్మన్ గా ఉంటారని
ఎంపీడీఓ, తహసిల్దార్,
మండల విద్యాశాఖాధికారి ఉంటారని తెలిపారు. ఈ జిల్లా, మండల కమిటీలు ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యా సంస్థలు, ఆసుపత్రుల్లో ఆహారం అందిస్తున్న అన్ని ప్రభుత్వ సంస్థలలో తనిఖీ చేసి, తనిఖీ నివేదికను సమర్పించాలని ఆదేశించారు.

అంశాలు::-

బియ్యం, నిత్యావసర వస్తువులు నిల్వలు, వంటగది వద్ద పరిశుభ్రత ప్రమాణాలు, ఆహార నాణ్యతలు పరీక్షలు,

వంట చేయు సమయంలో ఆహార భద్రతా చర్యలు పాటింపు,

వంట చేసే ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచడం, వంట పాత్రలు, పరికరాలు, ఇతర వస్తువులను ఎప్పటికప్పుడు శుభ్రపరచడం,

కుక్, హెల్పర్స్ మరియు ఇతర సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం మరియు ఆరోగ్య పరీక్షలు, పెస్ట్ కంట్రోల్, ఫుడ్ సర్వింగ్ ఏరియా, పిల్లలు హ్యాండ్ వాష్ వ్యక్తి గత పరిశుభ్రత పాటించుట, సురక్షిత మంచినీటి సరఫరా, డ్రైనేజీలో వ్యర్థాలు నిల్వ లేకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహణ, వ్యర్థాలు తొలగింపు వంటి కార్యక్రమాలు కమిటీలు కేటాయించిన పరిధిలోని సంస్థలను తనిఖీ చేసి నివేదికలను సమర్పించాలని స్పష్టం చేశారు. ఆహార భద్రతా కమిటీలు చేసిన తనిఖీలు, తీసుకున్న చర్యలపై నివేదికలు అందచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు.

# కార్పొరేషన్ లో తప్పని గ్రామ సింహాల బెడద

- ఇటీవల కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి
- భయాందోళనలో చిన్నారుల తల్లిదండ్రులు
- పట్టించుకోని కార్పొరేషన్ సిబ్బంది
- గ్రామ సింహాల బారి నుంచి కాపాడాలని ప్రజల వేడుకోలు



హైదరాబాద్ పెన్ పవర్:నోటిఫైడ్ ఏరియాగా పేరుగాంచి రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ గా ఎదిగి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా రూడా ఏర్పాటుపై ఉత్తర్వులు జారీ చేసి ఆచరణలో అమలు కోసం యుద్ధ ప్రాతిపదికన ప్రణాళికలు జరుగుతున్నాయి. అయినప్పటికీ గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో గ్రామ సింహాల బెడద తప్పించడంలో కార్పొరేషన్ అధికారులు అవలంబిస్తూనే ఉన్నారు. గడిచిన కొన్నాళ్లుగా ఈ ప్రాంత ప్రజలకు కుక్కల భయం బెడద తప్పడం లేదు. పారిశ్రామిక ప్రాంతంలో అనేక వీధులలో పదుల సంఖ్యలో ఒక్కసారిగా గుమిగూడి వీధుల వెంట తిరుగుతూ గ్రామ సింహాలైన వీధి కుక్కలు చిన్నారులు పెద్దలపై తిరగబడి కరుస్తూ.. దాడులకు పాల్పడుతున్నాయి. కాగా ఇటి వారి కాలంలో రామగుండం పట్టణంలో ఓ చిన్నారిపై కొన్ని వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. సదరు చిన్నారి స్థానికంగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయినప్పటికీ కార్పొరేషన్ అధికారులు వీధి కుక్కలను తరలించడంలో తమ నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నారనే వాదన సైతం ప్రజల నుండి అధికంగా వినవస్తున్నాయి. పారిశ్రామిక ప్రాంతంలోని కొన్ని డివిజనల్ నుండి కొందరు పలుమార్లు వీధి కుక్కల బెడద నుండి తమను కాపాడాలని కార్పొరేషన్ కార్యాలయ అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ అధికారులు మొండి వైఖరిని అవలంబిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇంటి నుండి తమ పిల్లలను బయటకు పంపించాలంటే తల్లిదండ్రులు వీధి కుక్కలు అంటే భయపడుతూ వారిని బయటికి పంపించడానికి జంకుతున్నారు. ద్విచక్ర వాహన లపై వెళ్లే వాహనదారులపై సైతం రోడ్డు వెంట తిరిగే వీధి కుక్కలు గుంపు ద్విచక్ర వాహనదారులపై పరిగెడుతూ భయభ్రాంతులకు గురి చేయడంతో అనేకమంది ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి వాహనం పై నుండి కింద పడి తీవ్ర గాయాల పాలవుతున్నారు. మరికొందరు ద్విచక్ర వాహనదారులపై వీధి కుక్కలు దాడికి పాల్పడి కరుస్తూ గాయపరుస్తున్నాయి. అదేవిధంగా రాత్రిపూట ద్విచక్ర వాహనాలపై విధులకు వెళ్లే సింగరేణి కార్మికుల పై వీధి కుక్కలు వెంటపడి అరుస్తూ దాడి చేయడంతో వాహనం పై నుండి కింద పడి గాయల పాలవుతున్నారు.ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రధాన కూడలలో గుంపులు గుంపులుగా ఉండే శునకాలను, వ్యాధిన బారినపడి రోడ్లపై తిరుగుతున్న వాటిని సైతం ప్రాంతాలకు తరలించాలనిప్రజలు వేడుకుంటున్నారు.

## కేటీఆర్ బాష మార్చుకోవాలి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

హైదరాబాద్ పెన్ పవర్: కేటీఆర్ తన భాషను మార్చుకోవాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వారి హయాంలో పేదల భూములను లాక్కొని పెద్దలు పంచి పెట్టారు. మీ కార్యకర్తలను కాపాడుకోవడానికి ప్రభుత్వం పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం చేస్తే ఊరుకోం. మీ వల్ల జరిగిన పొరపాటును సరిదిద్దుతున్నాం.దళిత గిరిజనులకు చెందాల్సిన భూములు ఉన్నత గ్రాలకు చెందితే దానిని సరిదిద్దడం తప్పా. మొన్న కలెక్టర్ పై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఐఏఎస్ ల సంఘం స్పందిస్తే వాటికి కేటీఆర్ ఇప్పటివరకు సమాధానం చెప్పలేదు.ఆయన భాష వల్ల సిరిసిల్ల ప్రాంతం పరువు పోకుండా కాపాడాల్సిన బాధ్యత ఉంది.వాడు వీడు అంటే మేము కూడా వాడు వీడు అనాల్సి వస్తుంది.రేవంత్ రెడ్డి తాత వరకు ఎందుకు కేటీఆర్ మొన్నటి ఎన్నికల్లో పిసిసి అధ్యక్షులుగా రేవంత్ రెడ్డి మీ అయ్యను కుర్చీలో నుంచి దింపి ఫామ్ హౌస్ కి పరిమితం చేయడాన్నీ మరిచిపోయావా.ప్రజాస్వామ్య పంతాలో విమర్శిస్తే మేము స్వాగతిస్తాం స్వీకరిస్తాం భుతులు మాట్లాడితే మేము మాట్లాడతాం. అసెంబ్లీ సమావేశాలలో మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్ ను వచ్చి సూచనలు సలహాలు ఇవ్వమంటే ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు.

## చొప్పదండి లో బిఆర్ఎస్ హాస్టల్ బాట:నేతల అరెస్టులు

హైదరాబాద్ పెన్ పవర్:చొప్పదండి లో బిఆర్ఎస్ హాస్టల్ బాట నిర్వహించింది. శనివారం ఉదయం

గురుకుల పాఠశాలల సమస్యల తెలుసుకునేందుకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బయలు దేరారు. పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసారు. సుంకె రవిశంకర్ ను హౌస్ అరెస్టు చేసారు. కొప్పుల ఈశ్వర్ ను అదుపులోకి తీసుకొని ఇంటికి తరలించారు.

## సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచిన కూటమి ప్రభుత్వం



హైదరాబాద్ పెన్ పవర్:ఎన్టీఆర్ భరోసా ఫింఛన్లను ఎలాంటి జాప్యం లేకుండా లబ్ది పొందేలా చర్యలు వితంతువులకు .. 15 రోజుల్లోనే పింఛను లబ్ధిపీలో 63.92 లక్షల మందికి రూ.2709 కోట్ల ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేదల సంక్షేమానికే కూటమి ప్రభుత్వం పెద్దపీటటీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావుగొల్లపూడి ఎన్ని ఇబ్బందులు, కష్టాలు ఎదురైనా సీఎం చంద్రబాబు క్రమం తప్పకుండా ఫించన్లు అందిజేస్తున్నారని టీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు తెలిపారు. పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని అన్నారు. డిసెంబర్ నెల ఒకటో తేదీ ఆదివారం కావడంతో సామాజిక పింఛన్లు ఒకరోజు ముందుగానే అంటే... ఈనెల 30వ తేదీనే పంపిణీ చేస్తున్నట్లు ఇందుకు సంబంధించి పింఛన్దారుల జాబితాతోపాటు సొమ్ములు విడుదల చేయడం జరిగిందని పేర్కొన్నారు. శనివారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి పంచాయితీ పైపులరోడ్డులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర

**జయశంకర్ భూపాలపల్లి, పెన్ పవర్:** భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వేశాలపల్లి, పెద్దకుంటపల్లి, కాశింపల్లి, జంగేడు తో పాటు భూపాలపల్లి గ్రామీణ మండలం గుడాడుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. అనంతరం ఆయా గ్రామాలల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ? రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని, రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలల్లో విక్రయించాలని రైతులకు సూచించారు. ధాన్యం తూకం విషయంలో రైతులను మోసం చేస్తే ఊరుకునేది లేదని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు.

## రహదారి భద్రతపై శ్రీ నలంద విద్యార్థుల మెగా ర్యాలీ




**హైదరాబాద్ పెన్ పవర్:**తొర్రూరు పట్టణంలో శ్రీ నలంద పాఠశాల విద్యార్థులు స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా సేఫ్ ఇండియా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ట్రాఫిక్ ఎస్ఐ రాంజీ నాయక్ పాల్గొని రోడ్డు భద్రత మరియు ట్రాఫిక్ నియమ నిబంధన గురించి విద్యార్థులతో కలసి పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు , పాఠశాల ప్రిన్సిపాల్ రవీందర్ మాట్లాడుతూ ప్రతి వానాదారుడు విధిగా హెల్మెట్ , సీట్ బెల్ట్ ధరించి పరిమితి వేగంతో డ్రైవింగ్ చేయడం అనేది తప్పనిసరి అని తెలిపారు , మద్యం సేవించి వాహనాలు నడపకూడదు, పాదాచారులకు దారి ఇవ్వడం, ట్రాఫిక్ సిగ్నల్స్ సంకేతాల గుర్తించడం వంటి నియమాలను తెలిపారు , హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారికి పుష్పగుచ్చాలు అందజేసి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు

ఇట్టి కార్యక్రమంలో ఏఎస్ఐ తారాచంద్ , హేమ , పాఠశాల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, చేతన్ , పద్మాకర్, డీన్ యాకన్న , ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు

## ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ ఆఫీసర్లను సన్మానించిన పోలీస్ కమిషనర్

**ఖమ్మం పెన్ పవర్::** ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ .. సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో భాద్యతయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖ కు ఎనలేని సేవలతో పోలీస్ శాఖ మన్ననలు పొందారని పోలీస్ కమిషనర్ కొనియాడారు. రిటైర్ మెంట్ తన వృత్తికే, కాని తన వ్యక్తిత్వానికి కాదని, మీ విధినిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో ఆనందంగా వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులలో .నాగేశ్వరరావు పి. క్రిష్టయ్య, ఏఆర్ఎస్ ఐ సూర్యారావు, ఏఆర్ఎస్ఐ లు ఫున్నారుఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ నరేష్ కుమార్, ఆర్ ఐ కామరాజు, పోలీస్ అసోసియేషన్ జానీమియా, పంతులు పాల్గొన్నారు.

# జిల్లాలో బెల్ట్ షాపుల పై కఠిన చర్యలు చేపట్టాలి

### అదనపు కలెక్టర్ హమీద్

**హైదరాబాద్ పెన్ పవర్:**రోడ్డు ప్రయాణాలు, డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగ నిషేధం పై అన్ని శాఖలు సమన్వయంతో అవగాహన సదస్సులను నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) అబ్దుల్ హమీద్ తెలిపారు. శనివారం (ఐడిఓసి) కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రోడ్డు భద్రత కమిటీ, మత్తు పదార్థాల వినియోగంపై సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశానికి అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రహదారుల వెంట స్పీడ్ బ్రేకర్లు, చెట్ల పొదలు లేకుండా తొలగించాలని, ఇంకా తొలగించవలసినవి ఉన్నట్లు గుర్తించినట్లయితే వారంలోగా పనులు పూర్తి చేయాలని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్ లపై అధికారులు కఠినంగా వ్యవహరించడం మాత్రమే కాకుండా, కౌన్సిలింగ్ కూడా ఇవ్వాలని సూచించారు. రోడ్డు, రద్దీ ప్రాంతాల్లో బస్సులు, ఇతర వాహనాలను ఆపడం లేదా పార్కింగ్ చేయడం వంటివి జరగకుండా ఆర్టీసీ, పోలీస్ సిబ్బంది సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా జిల్లాలో నిర్వహించే బెల్ట్ షాపుల పై చర్యలు తీసుకోవాలని, విద్యాసంస్థలలో డ్రగ్స్ వంటి మత్తుపదార్థాల వినియోగంపై అవగాహన సదస్సులను నిర్వహించాలన్నారు. జిల్లాలో బయటి ప్రాంతాల నుండి మత్తుపదార్థాల తరలింపు జరగకుండా తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి డీఈఈ బి.మనోహర్, ఎసిపి మధు, జిల్లా వైద్యాధికారి డా పల్వన్ కుమార్, ఎన్.హెచ్. డీఈఈ డి. అన్నయ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారి శారద, ఇతర పోలీస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గురుకులలా సందర్శనకు బయలు దేరిన చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అరెస్ట్

### ఎందుకు అరెస్టు చేస్తున్నారో తెలుపాలని పోలీస్ లను నిలదీసిన సుంకె

**హైదరాబాద్ పెన్ పవర్:**కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని వివిధ గురుకుల పాఠశాలలో వసతులు విద్యార్థుల సమస్యలు తెలుసుకోవడానికి చొప్పదండి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తన కారులో శనివారం బయలు దేరాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మార్గమధ్యంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ను అరెస్ట్ చేసి రామడుగు మండల పోలీస్ స్టేషన్ కు తీసుకొని వెళ్ళారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ

బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకుగురుకుల బాట కార్యక్రమంలో భాగంగా గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కాలేజీలను పరిశీలించేందుకు బయలు దేరగా పోలీసులు చేసిన అక్రమ అరెస్టును ఖండిస్తున్నట్లు తెలిపారు.గురుకుల, పాఠశాల విద్యను రేవంత్ సర్కార్ సంక్షోభంలోకి నెట్టిందని అయిన విమర్శించారు.11 నెలల్లో 52 మంది విద్యార్థులు మరణించారని?ఇందులో 38 ఫుడ్ పాయిజన్ సంఘటనలు జరిగాయని తెలిపారు. పాలన గాలికొదిలేసి నేరపూరిత నిర్లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులను పొట్టన బెట్టుకుంటోందని ఆరోపించారు. రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి లేరని? ముఖ్యమంత్రికి ఢిల్లీకి తిరిగేందుకే సమయం సరిపోతలేదని సుంకె రవిశంకర్ దుయ్యబట్టారు. విద్యార్థులు చనిపోతున్నా ఒక్క సమీక్ష కూడా నిర్వహించని ప్రభుత్వానికి ఉసురు తప్పదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు అన్ని రకాల గురుకుల విద్యాసంస్థలు కలిపి 291 ఉంటే వాటిల్లో కేవలం 1లక్ష 54 వేల మంది చెదివేవారున్నారని

కేసీఆర్ ప్రభుత్వ పాలనలో స్వరాష్ట్రంలో



1022 గురుకులం ఏర్పాటు చేసుకుని 6 లక్షల10 వేల 810 మంది విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య, భోజనం అందించడం జరిగిందని తెలిపారు. అంతే కాకుండా అన్ని గురుకులాలను కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసుకొని,కేవలం గిరిజన గురుకులాలు గతంలో 91 మాత్రమే ఉంటే అదనంగా మరో 97 గురుకులను ఏర్పాటు చేసుకుని 91,370 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యావిధానం, ఇంగ్లిష్ మీడియంలో బోధన, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారం వంటి విద్యాభివృద్ధి పథకాలను రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా అమలు చేసింది అని చెప్పారు. రాష్ట్రంలోని ప్రైవేటు విద్యాసంస్థల నుంచి ప్రభుత్వ విద్యా సంస్థలకు విద్యార్థుల వలసలు పెరుగాయని . గురుకులాల్లో సీట్ల పొందడం కోసం విద్యార్థులు పోటీ పడేవారని పేర్కొన్నారు.ఎలా ఉండే విద్యావ్యవస్థ ఎలా తయారు అయిందని ప్రభుత్వాన్ని విమర్శలు గుప్పించారు.